# నేనూ నీలాగే....

ఆఫీసు నుంచి ఇంటికి చేరుకోగానే గేటుకు తగిలించి ఉన్న లెటర్‌బాక్స్ కేసి ఓ చూపు పారేయడం నాకు అలవాటు. ఇవాళ లోపల ఏదో కవరు కనిపిస్తే చేతిలోకి తీసుకున్నాను. కవరుకు నలువైపులా పసుపురాసిన గుర్తులున్నాయి. అడ్రసుకేసి చూసాను. నాకే వచ్చిందది. ఆ వెంటనే నా చూపులు ఫ్రమ్ అడ్రసు వైపు మళ్లాయి. చలపతి, వైజాగ్ అన్న చిరునామా చూడగానే నా పెదాలపై చిరునవ్వు చోటుచేసుకుంది.

'ఓరి భడవా, నువ్వా? ఎన్నాళ్లకు మళ్లీ!' అనుకుంటూ నేనుంటున్న పోర్షను వైపు వెళ్లాను. తాళం తీసి కవరుని టీపాయ్‌పై ఉంచి స్నానం చేసేందుకు బాత్రూమ్‌లో దూరాను. చన్నీటి స్నానం అలసటను పోగొట్టి మనసులో హాయిని నింపింది. టవల్‌తో వొళ్లు తుడుచుకుంటూ హాల్లోకి వచ్చాను. ఆ సమయానికి రోజూ టీపాయ్‌పై టీ కప్పు నా కోసం సిద్ధంగా ఉండేది. ఇవాళ ఆ యోగం లేదు. నిన్ననే నా శ్రీమతి పుట్టింటికి వెళ్లింది.

ఓ గుక్కెడు ఛాయ్ పెట్టుకుందామని వంటింట్లో చొరబడ్డాను. ఐదు నిమిషాల తరువాత టీ కప్పుతో హాల్లోకి వచ్చి, కప్పును టీపాయ్‌పై ఉంచి ఈజీ ఛైర్‌లో విశ్రాంతిగా కూర్చున్నాను. కవరుని చేతిలోకి తీసుకుని శుభలేఖ బయటికి తీసాను. టీ తాగుతూ ఆసక్తిగా చదివాను.

చదవడం పూర్తవగానే నా ఆలోచనలు గతంవైపు మళ్లాయి.

కాలేజీలో చదివే రోజుల్లో చలపతి నాకు మంచి మిత్రుడు. తానేదైనా అనుకుంటే అది నెరవేరేదాకా ఎదురు చూసే ఓర్పు వాడి స్వంతం. అదో తరహా మనిషి. ఏదైనా నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయాన్ని ఓ పట్టాన మార్చుకోడు. ఎవడి పిచ్చి వాడికి ఆనందం అంటుంటారే... ఈ సామెత మా చలపతికి సరిగ్గా సరిపోతుంది.



ఇలా ఎందుకంటున్నానంటే ఆ రోజుల్లో వాడో భీషణ ప్రతిజ్ఞ చేసాడు. అదేమిటంటే లైఫ్‌లో పెళ్లంటూ చేసుకుంటే శ్రీదేవిలాంటి అందచందాలున్న అమ్మాయినే చేసుకుంటానని.

ఆ రోజుల్లో క్లాసులు ఎగ్గొట్టి మేమెన్నో సినిమాలు చూశాం. వీడు యీ భీషణ ప్రతిజ్ఞకు పూనుకున్న రోజున శ్రీదేవి తొలిసారి హీరోయిన్‌గా నటించిన 'పదహారేళ్ల వయసు' సిన్మాకెళ్లాం. అప్పటికది కొంచెం పాత సినిమాయే. ఆ సినిమాలో శ్రీదేవి అభినయం, ముద్దొచ్చే అందం చూసి చిత్తయిపోయిన మావాడు బయటికొచ్చాక జీవితంలో పెళ్లంటూ చేసుకుంటే అలాంటి అమ్మాయినే చేసుకుంటాననే కోర్కె నా వద్ద వెలిబుచ్చాడు. ఏదో సరదాకు అన్నాడులే అని నేను తేలిగ్గా తీసుకున్నాను. చదువు

పూర్తయిన కొన్నాళ్లకు నేను బ్యాంక్ ఉద్యోగంలో చేరితే వాడు కాలేజీలో లెక్చరర్ అయ్యాడు. పెళ్లి విషయంలో చలపతిలా నాకు పట్టుదల ఏదీ లేనందున ఉద్యోగంలో చేరిన వెంటనే మాధవిని వివాహం చేసుకున్నాను. అది మా పెద్దవాళ్లు నిర్ణయించిన సంబంధమే. నా ప్రమేయం నామమాత్రం.

మావాళ్లు నాకు సంబంధాలు వెదికే సమయంలో చలపతి అమ్మానాన్నలు వాడికి కూడా అనేక సంబంధాలు చూసారు. ఏ అమ్మాయీ వాడి కంటికి శ్రీదేవిలా కనిపించలేదు. వాడి భీషణ ప్రతిజ్ఞ గురించి తెలీని వాడి అమ్మానాన్నా పెళ్లిచూపులకంటూ అక్కడికీ ఇక్కడికీ లాక్కుపోతుండేవారు వాణ్ని.



## వి.బి. నరసింహారెడ్డి

వాళ్ల అవస్థ చూడలేక నా వంతు సాయం చేద్దామని నాకు తెలిసిన ఓ పెళ్లిళ్ల పేరయ్యతో వాడి అభిలాష గురించి చెప్పాను. కొన్నాళ్లకు ఆయనో ఫొటోతో నా వద్దకు వచ్చాడు. ఆ ఫొటో చూసి సంతృప్తి పడ్డ నేను ఫొటో నా వద్ద ఉంచుకుని ఓ రోజు వాడికి చూపించాను. చూడగానే ఎగిరి గంతేస్తాడని నేను ఊహించాను. అదే జరిగితే మంచి పార్టీ ఇమ్మని అడగాలనుకున్నాను.

కాని జరిగింది వేరు.

వాడు నా చేతిలోని ఫొటో తీసుకుని కాసేపు సీరియస్‌గా పరిశీలించాడు. తరువాత ఫొటోను ముందున్న టేబిల్‌పై ఉంచి రెండు చేతుల్తో ఆ పిల్ల ముఖమంతా మూసేసి కళ్లు మాత్రమే కనిపించేలా పట్టుకుని నిశితంగా పరిశీలించాడు. ఆపై పెదవి విరుస్తూ నావైపు చూసి 'చూశావా? ఈవిడగారి కళ్లు శ్రీదేవి కళ్లలా లేవు. ఆమె కళ్లు గుండ్రంగా మరింత విశాలంగా ఉంటాయి' అన్నాడు.

'నీకు పెళ్లియోగం లేదేమోనని నాకు అనుమానంగా ఉందిరా! ఎందుకైనా మంచిది, ఓమారు జ్యోతిష్యుడికి చూపించుకో' అన్నాను ఒళ్లు మండి. ఆ పనీ చేసాడు వాడు. వారం గడిచాక నాతో 'జ్యోతిష్యుడికి చేయి చూపించాను. ఇద్దరు భార్యలని చెప్పాడు' అన్నాడు నింపాదిగా.

ఓ రోజు పెళ్లిళ్ల పేరయ్యా మరో ఫొటో చూపించాడు వాడికి. ఆ ఫొటోలోని పిల్లనూ ఎగాదిగా పరిశీలించి, ఉంటే గింటే శ్రీదేవి చెల్లిలా ఉంది తప్ప శ్రీదేవిలా లేదని తీర్మా నించాడు.


ఇహ వీడికి పెళ్లియోగం లేదనే నిశ్చితాభి ప్రాయానికి వచ్చాను. ఆ తరువాత వాడు గుం టూరులో ఏదో కాలేజిలో కొన్నాళ్లు పనిచేసాడు. వైజాగ్ ఎప్పుడు వెళ్లాడో తెలియదు. కొంత కాలంగా మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు. సుమారు నాలుగేళ్ల విరామం తరువాత ఇదిగో ఇప్పుడు వాడి నుంచి శుభలేఖ అందింది.

పెళ్లి కూతురు పేరు శ్రీవాణి. 'అచ్చు శ్రీదేవి లా ఉండి ఉంటుంది. లేకుంటే పెళ్లికి ఎందుకు సిద్ధపడతాడూ బడుద్దాయ్' అనుకున్నాను మనసులో.


పెళ్లికి శ్రీమతితో కలిసి తప్పకరావాలని ఆ తరువాత వాడు ఉత్తరం కూడా రాసాడు. ఆ ఉత్తరంలో ఎక్కడా శ్రీదేవి ప్రస్తావన లేక పోవడంతో నాలో సస్పెన్స్ కొనసాగింది.

* * *

వాడి పెళ్లిరోజు రానే వచ్చింది. ముందు రోజు రాత్రే నేనూ నా శ్రీమతీ వైజాగ్ చేరు కున్నాం. లాడ్జిలో బసచేసాం. ఉదయం తొమ్మి దిన్నరకు పెళ్లి ముహూర్తం. గంట ముందే నేనూ మాధవీ ఫంక్షన్ హాలుకు చేరుకున్నాం. పెళ్లి పందిట్లో నా కళ్లు ఆత్రంగా పెళ్లికూతురు రాకకోసం ఎదురుచూశాయి. పెళ్లికొడుకు వేష ధారణలో మావాడు వెలిగిపోతున్నాడు. వాడి ముఖంలోని ఆనందం చూసాక 'సందేహం లేదు, పెళ్లి కూతురు శ్రీదేవి పోలికలతో అచ్చు గుద్దినట్లు ఉండి ఉంటుంది' అన్న స్థిర నిర్ణయా నికి వచ్చాను. ఇంతలో పెళ్లికుమార్తెను తీసుకు రండని పురోహితుడు పురమాయించాడు.



'గడ్డి చేమంతులు' నానీల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖకవి ఆచార్య ఎన్. గోపి. చిత్రంలో కవయిత్రులు శ్రీమతి ఎన్. అరుణ, డా॥ చిల్లర భవానీదేవి, పుస్తక రచయిత శ్రీ నాగిశెట్టి తాతయ్యనాయుడు, గుంటూరు నగర మేయర్ శ్రీ కన్నా నాగరాజు, ప్రముఖ కవి శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్యా ఉన్నారు.




నా చూపులు ఆత్రుతగా పెళ్లికుమార్తె వచ్చే దిశకు మళ్లాయి. కాసేపటికి వధువు రానే వచ్చింది. వచ్చి పందిట్లో మావాడి ప్రక్కన ఆశీనురాలైంది.

నేను ఆమెనే చూస్తున్నాను. శ్రీదేవి పోలికల్ని ఆమె ముఖంలో వెదికిపట్టుకునే ప్రయత్నం చేస్తున్నాను. నా ప్రయత్నం ఫలించలేదు. శ్రీదేవి పోలికలైతే లేవుగానీ అమ్మాయి లక్షణంగా ఉంది. ముఖంలో లక్ష్మీ కళ ఉట్టిపడుతోంది. ఆ మాటే శ్రీమతితో అన్నాను మనస్ఫూర్తిగా.

పెళ్లయిన పదిరోజులకు వాడు శ్రీమతితో కలిసి విజయవాడ వచ్చాడు కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు. మా ఇంట్లోనే దిగారు. ఆ రోజు రాత్రి భోజనాలయ్యాక ఆడవాళ్లిద్దరూ వంటిల్లు సర్దుకుంటూంటే నేను వాడిని తీసుకుని డాబాపైకి వెళ్లాను.

మాటల సందర్భంలో ఉన్నట్టుండి 'నేను శ్రీదేవి పోలికలున్న అమ్మాయినే పెళ్లాడతానని కాలేజిలో చదివేరోజుల్లో భీషణ ప్రతిజ్ఞ చేశాను గుర్తుందా?' అడిగాడు వాడు.

'వదిలెయ్‌రా ఆ ముచ్చట ఇప్పుడెందుకు?' అన్నాను ఏమాత్రం ఆసక్తిలేనట్టు. వాడు వదల్లేదు.

'శ్రీదేవి లాంటి అమ్మాయిని వెదికి పట్టుకునే ప్రయత్నంలో నేను ఫెయిల్ అయ్యానని నీవు అనుకుంటే పొరపాటే. అచ్చు అలాంటి పోలికలతోనే ఉన్న అమ్మాయిని వైజాగ్‌లోనే వెదికి పట్టుకున్నాను' అన్నాడు. నేను మౌనంగా వాడు చెప్పేది వింటున్నాను.

'మరి ఆ అమ్మాయినే పెళ్లి పీటల వరకూ ఎందుకు నడిపించలేకపోయావని నీవడగవచ్చు. ఆ కథాకమామిషూ చెప్తాను విను' – కొద్దిసేపు ఆగాడు. ఎలా మొదలుపెట్టాలా అని ఆలోచించాడు కాబోలు.

కాసేపటికి నోరు విప్పి 'నేను ఆ అమ్మాయి కంట్లోపడడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించాను. నెలరోజుల పాటు ఆమెను అనుసరిస్తూ తిరిగాను. ఆమె కటాక్షవీక్షణాల కోసం

ఎంతగానో ఎదురుచూసాను' – మళ్లీ కొద్దిసేపు ఆగాడు.

తిరిగి – 'ఓ రోజు ఆ అమ్మాయి బీచ్‌వద్ద కటాక్షించి తనే నా వద్దకు వచ్చింది' అన్నాడు.

నాలో ఆసక్తి క్రమంగా పెరగసాగింది.

'మిస్టర్! నీవు నా వెంట ఎందుకు పడుతున్నావ్? అని ప్రశాంతంగానే అడిగింది'.

'దానికి నువ్వేమన్నావ్?' అడిగాన్నేను కుతూహలాన్ని అణచుకోలేక.

'ఆమె అలా తనకుతానుగా నా వద్దకు వచ్చి ప్రసన్న వదనంతో అడిగేసరికి నాలో ఎన్నడూ లేనంత ఉత్సాహం చోటు చేసుకుంది. నా మనసులోని కోరిక చెప్పాను. మీరు అచ్చు శ్రీదేవిలా ఉన్నారు. మీరు కనుక కటాక్షిస్తే నా మిత్ర బృందం మధ్య గర్వంగా తలెత్తుకు తిరగగలుగుతానని ఆమెకు వివరించాను. కట్నప్రసక్తీ ఉండదన్నాను. ఆమె ఎక్కడ నిరాకరిస్తుందో నన్న భయంతో ఇంకా ఏవేవో హామీలిచ్చాను' అన్నాడు ఆనాటి ఆ సంఘటనను మననం చేసుకుంటూ... తనలో తాను నవ్వుకుంటూ.

కొద్ది క్షణాల మౌనం తరువాత తిరిగి 'ఆమె గనక నన్ను వివాహమాడితే జీవితాంతం ఆమె మాట వింటానని, వంటావార్పులోనూ సాయం చేస్తాననీ చెప్పాను'.

'ఇంకా ఏమన్నారూ?' వాడి శ్రీమతి గొంతు, నా శ్రీమతి నవ్వు వినబడితే తలతిప్పి చూసాను. ఇద్దరూ మెట్లపై కూర్చుని మా సంభాషణంతా విన్నట్టున్నారు.

వాడు కొద్దిగా తడబడినట్టు నటిస్తూ 'అపై నాకు నేనుగా ఏ హామీలూ ఇవ్వలేదు... ఆవిడే అడిగింది' అన్నాడు.

'ఏమడిగిందేమిటి?' – వాడి శ్రీమతి.

'నా దుస్తులు ఉతికి ఇస్త్రీ సైతం చేసి పెడతారా అనడిగింది' అని వాడు చెబుతుంటే అంతా ఘొల్లున నవ్వాం.

'దానికి నువ్వేమన్నావ్?' అడిగాన్నేను.

'నాదెంత అదృష్టం! అని పొంగిపోయి ఉంటారు' – వాడి శ్రీమతి అంది.

వాడు ప్రశాంతంగా 'అందమైన అమ్మాయి అమాయకంగా ముఖం పెట్టి అడుగుతుంటే ఏ మగాడైనా కాదని ఎలా అనగలడు? నాకు మాత్రం హృదయం లేదా?' అని ప్రశ్నించాడు. తన శ్రీమతిని మరికొంచెం ఉడికిస్తూ.

'ఇంకేం? ఆ అమ్మాయినే కట్టుకోపోలేక యారూ?' – ఆవిడ.

'నన్ను కట్టుకునే అదృష్టం తనకు లేదంది ఆ అమ్మాయి' – వాడు.

'ఎందుకనిట పాపం?' – ఆవిడ

నేనూ, నా శ్రీమతీ ఆసక్తిగా వారి సంభాషణ వింటున్నాం.

'ఏడాది క్రితం ఆమె ఓ నిర్ణయం తీసుకుందిట!' – వాడు శూన్యంలోకి చూసాడు.

'ఏమిటో అది?' వాడి శ్రీమతి గొంతులో వ్యంగ్యం.

కొద్ది సెకన్ల తరువాత వాడు భారంగా ఓ నిట్టూర్పు విడిచి 'క్రిందటి నెలలోనే స్నేహితురాళ్లతో కలిసి టీవీలో 'మైనేప్యార్‌కియా' సినిమా చూసిన ఆమె పెళ్లంటూ చేసుకుంటే సల్మాన్ లాంటి కుర్రాణ్నే చేసుకుంటానని వగలుపోయిందట!' అన్నాడు.

వాడి యాక్టింగ్ చూసి వాడి శ్రీమతితో సహా అంతా ఘొల్లున నవ్వాం.

'ఇప్పటికైనా బోధపడిందా, ఎదుటివారికీ ఆశలుంటాయని?' హితబోధ చేస్తూ అన్నాన్నేను.

బుద్ధిగా తలూపాడు వాడు. ●